క్లుప్తంగా

సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

సాక్షి నెట్‌వర్క్ : వర్ధన్నపేట, చెన్నారావుపేట, రాయపర్తి, సంగెం మండలాలోని తహసీల్దార్ కార్యాలయాల ఎదుట వీఆర్‌ఏలు సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం కేటీఆర్ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని కేక్ కట్ చేశారు.

విద్యుత్ అధికారుల స్పందన



సంగెం : 'వేలాడుతున్న మృత్యుపాశాలు' శీర్షికతో ఈనెల 16న ప్రచురితమైన 'సాక్షి' కథనానికి విద్యుత్ శాఖ అధికారులు సోమవారం స్పందించారు. కాపులకనపర్తి ఏడీఈ నర్సింహారావు, ఏఈ తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని ఆశాలపల్లిలోని పంట పొలాల్లో రెండు విద్యుత్ స్తంభాలు వేసి వేలాడుతున్న విద్యుత్ తీగలను వర్షంలోనూ సరిచేయించారు. విద్యుత్ శాఖ అధికారులకు, 'సాక్షి'కి రైతులు, ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

పోలీస్‌స్టేషన్‌లో ప్రేమ వివాహం



ఖానాపురం : కేసముద్రం మండలానికి చెందిన రవితేజ, ఖానాపురం మండలంలోని బుధరావుపేటకు చెందిన ప్రశాంతి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ప్రేమ వివాహం చేసుకున్నారు. ఇద్దరూ కొంత కాలంగా ప్రేమించుకుంటుండగా ఇరు కుటుంబాలకు విషయం తెలియడంతో ప్రశాంతికి కుటుంబ సభ్యులు వివాహం చేయాలని నిశ్చయించగా యువకుడి కుటుంబ సభ్యులు నిరాకరించారు. దీంతో యువతి కుటుంబభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా యువకుడి కుటుంబ సభ్యులను పిలిపించడంతో స్టేషన్‌లోనే ఏఎస్సై లక్ష్మారెడ్డి సమక్షంలో వివాహం చేశారు. అనంతరం ఇరు కుటుంబాలకు పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించి పంపించారు. కార్యక్రమంలో సర్పంచ్ కాస ప్రవీణ్‌కుమార్, మౌలానా, రాజశేఖర్, మురళీ, అల్లావుద్దీన్ పాల్గొన్నారు.

ఎస్సైగా పరమేష్ బాధ్యతల స్వీకరణ



దుగ్గొండి : స్థానిక పోలీస్‌స్టేషన్ ఎస్సైగా జక్కుల పరమేష్ సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేసిన నవీన్‌కుమార్ ఐనవోలుకు బదిలీ కాగా ఆయన స్థానంలో ఎల్కతుర్తి ఎస్సైగా పని చేసిన పరమేష్ బదిలీపై వచ్చారు. విధుల్లో చేరాక నిర్వహించిన సమావేశంలో ఎస్సై పరమేష్ మాట్లాడారు. మండలంలో శాంతిభద్రతలు, నేరాలు, రౌడీషీటర్ల వివరాలు సేకరించారు. శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని కోరారు.

15 మందికి వ్యాసెక్టమీ



వర్ధన్నపేట : మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో సోమవారం 15 మందికి వ్యాసెక్టమీ శస్త్రచికిత్స నిర్వహించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ నర్సింహస్వామి మాట్లాడారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ, సర్జన్ డాక్టర్ గోపాల్‌రావు, రాయపర్తి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వెంకటేశ్ ఆధ్వర్యంలో క్యాంప్ నిర్వహించినట్టు తెలిపారు. అనంతరం సర్జన్ డాక్టర్ గోపాల్‌రావు మాట్లాడారు. కోత, కుట్టు లేని వ్యాసెక్టమీ చేయించుకోవచ్చని, శస్త్రచికిత్స జరిగిన రోజు సాయంత్రమే ఇంటికి వెళ్లవచ్చని తెలిపారు. ఇబ్బందులూ ఉండవని, వారం రోజుల తర్వాత నుంచి దినవారీ పనులు యదావిధిగా నిర్వహించుకోవచ్చని వివరించారు.

ఎమ్మెల్యే వ్యాఖ్యలు హాస్యాస్పదం

చెన్నారావుపేట : మండలంలోని అక్కల్‌చెడలో అభివృద్ధి చేసినట్టు ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి వ్యాఖ్యలు చేయడం హాస్యాస్పదంగా ఉందని కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పులిశేరు రాజేందర్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గెలిచినప్పటి నుంచి గ్రామంలోకి ఎమ్మెల్యే రాలేదన్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇప్పిస్తామంటూ మోసపూరిత మాటలతో బీఆర్‌ఎస్‌లో చేర్చుకుంటున్నారని ఆరోపించారు. గ్రామంలో మాజీ ఎమ్మెల్యే మాధవరెడ్డి చొరవతో నిర్మితమైన బీటీ రోడ్డు, అందిన ఇందిరమ్మ ఇళ్లు మాత్రమే కనిపిస్తున్నట్టు వివరించారు. గ్రామానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిందేమీ లేదని తేటతెల్లం చేశారు. తప్పుడు ప్రకటనలు మానుకోవాలని హితవు పలికారు.

కేటీఆర్ జన్మదిన వేడుకలు

జిల్లాలోని నర్సంపేట, నల్లబెల్లి, ఖానాపురం, వర్ధన్నపేట, రాయపర్తి, పర్వతగిరి, నెక్కొండ, దుగ్గొండి, సంగెం, గీసుగొండ, తదితర మండలాల్లో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేశారు. మొక్కలు నాటారు. అనాథాశ్రమాల్లో విద్యార్థులకు నోట్ బుక్కులు పంపిణీ చేశారు.

–సాక్షి నెట్‌వర్క్



నల్లబెల్లి : కేక్ కట్ చేస్తున్న జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న



దుగ్గొండి : కేక్ కట్ చేస్తున్న వైస్ చైర్మన్ శ్రీనివాస్



పర్వతగిరి : కేక్ కట్ చేస్తున్న ప్రజాప్రతినిధులు



గీసుగొండ : కొనాయమాకులలో..



నర్సంపేట : కేక్ కట్ చేస్తున్న కమిషనర్



నెక్కొండలో..



సంగెంలో..

మహిళా సంక్షేమంలో దేశానికే ఆదర్శం

● పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

గీసుకొండ : మహిళల సంక్షేమంలో దేశానికే తెలంగాణ ఆదర్శంగా నిలిచేలా సీఎం కేసీఆర్ కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ పథకాలు అమలు చేస్తున్నారని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తెలిపారు. మండలానికి చెందిన లబ్ధిదారులకు హనుమకొండలోని తన నివాసంలో సోమవారం ఆయన రూ.34,03,044 విలువైన కళ్యాణలక్ష్మీ, సాదీముబారక్ చెక్కులు పంపిణీ చేసి మాట్లాడారు. పేదల కుటుంబాలు ఆడపిల్లల వివాహానికి ఇబ్బంది పడకుండా ప్రభుత్వం ఆదుకుంటోందని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వీరగోని రాజ్‌కుమార్, నాయకులు సుంకరి శివ, శాయంపేట హవేలి, బొడ్డుచింతలపెల్లి సర్పంచ్‌లు రాజబోయిన రజిత, కేదాసి అనిల్, గీసుకొండ పీఏసీఎస్ చైర్మన్ రడం శ్రీధర్, కొమ్ముల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే ధర్మారెడ్డి

పండ్ల తోటల సాగుకు ప్రోత్సాహం

నెక్కొండ : వివిధ రకాల పండ్ల తోటల సాగుకు రైతులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని మండల వ్యవసాయ అధికారి (ఏఓ) ఎగిడి నాగరాజు తెలిపారు. మండలంలోని అలంకానిపేట గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మామిడి, సీతాఫలం, నిమ్మ, బత్తాయి, జామ, దానిమ్మ, డ్రాగన్ ఫ్రూట్, సపోటా, ఆయిల్‌పామ్, ఆపిల్ బేర్, మునగ వంటి పండ్ల తోటలను సాగు చేసేందుకు ఐదెకరాల్లోపు భూములుండి ఈజీఎస్ జాబ్‌కార్డు కలిగిన రైతులు అర్హులని తెలిపారు. ఆసక్తి కలిగిన రైతులు ఈనెల 31లోగా సంబంధిత ఏఈఓలకు పట్టాదారు పాస్ బుక్కు, ఇతర ప్రతులు అందజేయాలని సూచించారు. పండ్ల మొక్కలను ప్రభుత్వ నర్సరీలు, గుర్తింపు పొందిన ప్రైవేటు నర్సరీల నుంచి తీసుకోవాలని చెప్పారు. పండ్ల తోటల నిర్వహణకు ప్రభుత్వం ప్రతినెలా మొక్కకు రూ.10 చొప్పున చెల్లిస్తుందని, ఎరువుల కోసం ఒక్కో మొక్కకు ఏటా రూ.20లు చొప్పున మూడేళ్ల పాటు అందజేస్తుందని వివరించారు. రైతులు పండ్ల తోటల సాగు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో సర్పంచ్ అనంతలక్ష్మీ, రైతుబంధు గ్రామ కోఆర్డినేటర్ మాసాని వెంకటేశ్వర్లు, ఏఈఓ వినేకర్, తదితరులు పాల్గొన్నారు.



నెక్కొండ : మాట్లాడుతున్న ఏఓ నాగరాజు

పండ్లతోటల సాగుకు దరఖాస్తు చేసుకోండి

సంగెం : పండ్ల తోటల సాగుకు అర్హత కలిగిన రైతులు ఈనెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని ఉద్యాన వన శాఖ డివిజనల్ అధికారి ఎన్.తిరుపతి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఉద్యాన తోటల సాగును పెంచడానికి ప్రభుత్వం రాయితీ ప్రకటించిందని ఆయన పేర్కొన్నారు. ఐదెకరాల లోపు భూమి ఉండి ఈజీఎస్ జాబ్‌కార్డు, బోర్ లేదా బావి కలిగిన సన్న, చిన్నకారు రైతులు అర్హులని వివరించారు. బిందుసేద్యం యూనిట్లను ఉపాధి హామి పథకంలో మంజూరు చేస్తున్నట్టు వివరించారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు నూరు, ఇతర రైతులకు 90 శాతం రాయితీ ఉందని తెలిపారు. ఇతర వివరాల కోసం సంగెం, గీసుకొండ రైతులు సెల్ నంబర్ 7997725088లో సంప్రదించాలని కోరారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు సహకరించాలి

వర్ధన్నపేట : మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ గొడిశాల రవీందర్ కోరారు. అంబేడ్కర్ ప్రజాసంఘాలు, ప్రముఖులు, రాజకీయ పార్టీల నేతలతో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో కమిషనర్ మాట్లాడారు. సుమారు రూ.50 లక్షల వ్యయంతో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటు నమూనాను ప్రదర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆంగోతు అరుణ, వైస్ చైర్మన్ ఎలేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



నమూనా చిత్రాన్ని ప్రదర్శిస్తున్న కమిషనర్

మిస్సింగ్ కేసు నమోదు



వర్ధన్నపేట : మండలంలోని డీసీతండాకు చెందిన ఆటోడ్రైవర్ భూక్యా బాలాజీ కనిపించడం లేదంటూ అతడి భార్య కవిత ఫిర్యాదు మేరకు పోలీసులు సోమవారం మిస్సింగ్ కేసు నమోదు చేశారు. హనుమకొండ జిల్లా మడికొండలోని సోదరుడి ఇంటి నుంచి డీసీ తండాకు బయల్దేరిన బాలాజీ ఇంటికి చేరుకోలేదని, ఆచూకీ లభించడం లేదని కవిత ఫిర్యాదులో పేర్కొంది.

కుక్కల దాడి.. పందెం కోళ్లు మృత్యువాత



ఖానాపురం: కుక్కల దాడిలో కోళ్లు మృత్యువాత పడ్డాయి. ఈ ఘటన సోమవారం మండల కేంద్రంలో జరిగింది. మండల కేంద్రానికి చెందిన ఉపసర్పంచ్ మేడిద కుమార్‌కు చెందిన 30 పందెం కోళ్లు ఇంటి వద్ద ఉన్నాయి. ఈ క్రమంలో కుక్కలు దాడి చేయడంతో 25 కోళ్లు మృత్యువాత పడ్డాయి. దీంతో రూ.20వేల వరకు నష్టం వాటిల్లినట్లు ఆయన తెలిపారు.

కార్యవర్గం ఎన్నిక

చెన్నారావుపేట : చెన్నారావుపేట ఆటో యూనియన్ కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా గుర్రం భిక్షపతి, ఉపాధ్యక్షుడుగా వైనాల రాజేష్, కోశాధికారిగా కందిక శేఖర్, కార్యదర్శిగా జంగిలి నది, గౌరవ సలహాదార్లుగా వంగపండ్ల రాజు, నాంపెల్లి సంపత్, సభ్యులుగా జంపాల భాస్కర్, దుండి రంజిత్, సింగిరెడ్డి అనిల్, సుంకరి రాంప్రసాద్, గౌరవ అధ్యక్షులుగా కంది కృష్ణారెడ్డి, బండారి సత్యం ఎన్నికయ్యారు.

మహాధర్నాకు తరలిన బీజేపీ నాయకులు

నర్సంపేట : బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వకపోవడాన్ని నిరసిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో వరంగల్‌లో సోమవారం తలపెట్టిన మహాధర్నా కార్యక్రమానికి నర్సంపేట పట్టణానికి చెందిన బీజేపీ నాయకులు సోమవారం వాహనాలలో తరలివెళ్లారు. కార్యక్రమంలో ఆ పార్టీ నర్సంపేట పట్టణ అధ్యక్షుడు బాల్నె జగన్, ప్రధాన కార్యదర్శులు కొంపెల్లి రాజేందర్, కల్వచర్ల రామాంజనేయులు, యువమోర్చా నియోజకవర్గ కన్వీనర్ జూలూరి మనీష్‌గౌడ్, యువమోర్చా పట్టణ అధ్యక్షుడు గూడూరు సందీప్, ప్రధాన కార్యదర్శులు ఠాకూర్ విజయ్‌సింగ్, సామల ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యక్షులు కోమాండ్ల సప్తగిరి, ఎస్టీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు దుగ్యాల సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

కారోబార్ మృతి

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని రాజుపేట గ్రామ కారోబార్ ప్రతాప్ (50) అనారోగ్యంతో బాధపడుతూ పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందాడు. ఆయన మృతదేహానికి సర్పంచ్ బానోత్ దస్రు, ఎంపీటీసీ వీరన్న, ఉపసర్పంచ్ రవిరాజ్, కారోబార్ల సంఘం నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఎమ్మెల్యే పరామర్శ



నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని మహేశ్వరం గ్రామానికి చెందిన వీరమల్ల కరుణాకర్ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు నామాల సత్యనారాయణ, ఎంపీపీ మోతె కళావతి పద్మనాభరెడ్డి ఉన్నారు.

బాధిత కుటుంబాలకు..



చెన్నారావుపేట : మండల కేంద్రానికి చెందిన దొంతి యాదమ్మ, పిట్టల కార్తీక్ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాలను ఏఐసీసీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సోమవారం పరామర్శించారు. తొలుత మృతుల చిత్రపటాలకు నివాళులర్పించారు. మాధవరెడ్డి వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్య గోపాల్‌నాయక్, జిల్లా కార్యదర్శి మొగిళి వెంకట్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మంద యాకయ్యగౌడ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు తాళ్లపెల్లి నర్సయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్, సర్పంచ్ సిద్ధన రమేష్, నాయకులు అమీరోద్దీన్, చెవ్వ వెంకటేశ్వర్లు, మెంతుల రమేష్, ఫయాజ్, చిట్టె లింగయ్య, దొంతి బాబు, దొంతి శ్రీను, సుమన్, శ్రావణ్, తదితరులున్నారు.

నివాళి



పర్వతగిరి : మండలంలోని వడ్లకొండ సర్పంచ్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు ఆమడగాని రాజుయాదవ్ బంధువు ఆమడగాని పాపయ్య ఆదివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందగా ఆయన మృతదేహానికి బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రంగు కుమార్, మండల ప్రధాన కార్యదర్శి ఎర్రబెల్లి వెంకటేశ్వర్‌రావు, మాజీ జెడ్పీటీసీ లూనావత్ పంతులు సోమవారం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు వల్లందాస్ రంగయ్య, పంతంగి ఉప్పలయ్య, కరిమిళ్ల దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

మోకుదెబ్బ మండల అధ్యక్షుడిగా శ్రీనివాస్



నెక్కొండ : సర్వాయి పాపన్న గౌడ సంఘం మోకుదెబ్బ మండల అధ్యక్షుడిగా మండలంలోని సూరిపల్లి గ్రామానికి చెందిన మాదాటి శ్రీనివాస్‌ను నియమించినట్లు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యడి ప్రశాంత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంఘం అభివృద్ధికి శ్రీనివాస్ చేస్తున్న కృషిని గుర్తించి నియమించినట్టు పేర్కొన్నారు. గౌడ కులస్తులు అన్ని రంగాల్లో రాణించేలా సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేపడుతున్నట్టు వివరించారు. అనంతరం శ్రీనివాస్‌కు సంఘం పట్టణ అధ్యక్షుడు పలుసం రాజేందర్, నాయకులు రాంపెల్లి శ్రావణ్‌కుమార్, రావుల రమేష్, కక్కెర్ల యాకయ్య, పలుసం ముత్తయ్య, దొమ్మటి నారాయణ, బత్తిని మధు, సమ్మెట దేవేందర్, కొంకాల కుమార్ శుభాకాంక్షలు తెలిపారు.

హైస్కూల్‌ను దత్తత తీసుకుంటా..

● రాంపూర్‌కు చెందిన ఎన్‌ఆర్‌ఐ హీరా

నల్లబెల్లి : మండలంలోని మేడపల్లి గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్‌ను దత్తత తీసుకుంటానని రాంపూర్ గ్రామానికి చెందిన ఎన్‌ఆర్‌ఐ చింతపట్ల హీరా తెలిపారు. అమెరికా నుంచి ఇటీవల రాంపూర్ గ్రామానికి వచ్చిన ఆమె సర్పంచ్ చింతపట్ల సురేష్‌తో కలిసి పాఠశాలను సోమవారం సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో హీరా వేర్వేరుగా మాట్లాడి సమస్యలపై అధ్యయనం చేశారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. అమెరికాలో విద్యావవస్థ, ఉద్యోగ అవకాశాలను వివరిస్తూ విద్యార్థుల్లో ఉత్సాహం నింపారు. అనంతరం ఆమె మాట్లాడారు. సీఎం కేసీఆర్ మనుమడు హిమాన్షును స్ఫూర్తిగా తీసుకుని దాతలు ప్రభుత్వ బడులను దత్తత తీసుకుని వసతుల కల్పనకు కృషి చేయాలని ఆకాంక్షించారు. హీరాను ప్రధానోపాధ్యాయుడు రామచంద్రు, ఉపాధ్యాయులు అభినందించారు.



విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం తీసుకుంటున్న హీరా

కొనసాగుతున్న జీపీ కార్మికుల సమ్మె

సాక్షి నెట్‌వర్క్ : జిల్లాలోని నర్సంపేట రూరల్, రాయపర్తి, నల్లబెల్లి, నెక్కొండ, సంగెం, చెన్నారావుపేట, ఖానాపురం, దుగ్గొండి మండలాల్లో జీపీ కార్మికుల సమ్మె సోమవారం కొనసాగింది. నర్సంపేట మండల పరిషత్ కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మెకు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు, దుగ్గొండిలో రైతు సంఘం జిల్లా నాయకులు, రాయపర్తిలో సమ్మెకు టీపీసీసీ సభ్యుడు లకావత్ లక్ష్మీనారాయణనాయక్, నల్లబెల్లిలో సమ్మెకు ఎంసీపీఐ(యూ) నాయకులు మద్దతు తెలిపి మాట్లాడారు. సంగెంలో జీపీ కార్మికులు దున్నపోతుకు వినతిపత్రం అందించగా నెక్కొండ, చెన్నారావుపేట మండలాల్లో కార్మికులు చెవిలో పూలు పెట్టుకొని, ఖానాపురంలో బైక్‌ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు.



నర్సంపేట రూరల్ : మాట్లాడుతున్న సమ్మయ్య

'మణిపూర్' ఘటన దుర్మార్గం

● నిరసనల వెల్లువ

సాక్షి నెట్‌వర్క్ : మణిపూర్‌లో ఆదివాసీ మహిళలను నగ్నంగా ఊరేగించిన, పలువురిని హత్య చేసిన ఘటనలు దుర్మార్గమని పలువురు అన్నారు. వరంగల్ జిల్లాలో సోమవారం నిరసనలు వెల్లువెత్తాయి. స్వచ్ఛంద సంస్థ సమాఖ్య ఆధ్వర్యంలో బహుజన ఐక్య వేదిక ఆధ్వర్యంలో నర్సంపేట, అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో సంగెంలోని అంబేడ్కర్ విగ్రహాల వద్ద నిరసన తెలిపారు. అంబేడ్కర్ సెంటర్ నుంచి వరంగల్ రోడ్డు వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. దుగ్గొండి మండలంలోని తిమ్మంపేటలో సీపీఐ (ఎంఎల్), పీఓడబ్ల్యూ స్త్రీ సంఘటన, రైతు కూలీ సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. సంగెంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. రాయపర్తిలో కాంగ్రెస్ పార్టీ అనుబంధ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు గబ్బెట రాజు, నెక్కొండలో దళిత ప్రజాసంఘాల సమావేశంలో అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా కార్యదర్శి ఈదునూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మణిపూర్ ఘటనను ఖండించారు.

సంక్షేమ పథకాలకు ఆకర్షితులై చేరిక

● ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట : రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన శ్రేణులు బీఆర్‌ఎస్ పార్టీలో చేరుతున్నారని స్థానిక ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి తెలిపారు. నల్లబెల్లి మండలంలోని మూడుచెక్కలపల్లి, చెన్నారావుపేట మండలంలోని పాపయ్యపేట, దుగ్గొండి మండలంలోని మధిర గ్రామాలకు చెందిన పలు కుటుంబాలు సోమవారం బీఆర్‌ఎస్‌లో చేరగా వారికి తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. కాంగ్రెస్, బీజేపీలకు చెందిన పలు కుటుంబాలు బీఆర్‌ఎస్‌లో చేరడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



బీఆర్‌ఎస్‌లో చేరిన వారితో ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

పట్టణంలోని 12వ వార్డుకు చెందిన మాడిశెట్టి స్వర్ణలత, నాగుర్లపల్లికి చెందిన గొడ్డేటి రాములులకు రూ.1.50 లక్షలు చొప్పున మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి తన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. పేదలకు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా సాయం అందిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పాషా, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారులకు పరామర్శ

గీసుకొండ : గొర్రెకుంటలో కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న తెలంగాణ ఉద్యమకారులైన రాతిపెల్లి రాజు, ప్రవీణ్‌లను రాష్ట్ర రైతు విమోచన కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు సోమవారం పరామర్శించారు. తెలంగాణ ఉద్యమకారులకు అండగా ఉండి కంటికి రెప్పలా కాపాడుకుంటానని ఆయన భరోసా ఇచ్చారు. తొలుత మంత్రి కేటీఆర్ జన్మదినం సందర్భంగా గొర్రెకుంటలోని వృద్ధుల ఆనంద ఆశ్రమంలో వృద్ధులకు నాగుర్ల పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో ఉద్యమకారుల సంఘం నాయకులు సందెల సునిల్, గుర్రం రఘు, కొంగ సురేందర్, రాజు, రంగారావు, ప్రవీన్, సుధాకర్, సుదర్శన్, వెంకన్న, సదానందం, పోలెబోయిన కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పండ్లు పంపిణీ చేస్తున్న నాగుర్ల వెంకటేశ్వర్లు

చెక్‌డ్యామ్‌కు గండి.. నీటి వృథా



చెన్నారావుపేట : మండలంలోని బోజేర్వు శివారులోని జగ్గుతండా సమీపంలోని వాగుపై నిర్మించిన చెక్‌డ్యామ్‌కు పక్కన ఆదివారం రాత్రి గండి పడడంతో నీరు నిల్వకుండా వృథాగా పోతోంది. వెంటనే మరమ్మతు చేయకపోతే వరద కింది పొలాల మీదుగా ప్రవహించి మునిగిపోతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే అధికారులు స్పందించి మరమ్మతు పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.